# పాపం...సుబ్బారావు!

రచన :
శ్రీ సుసర్ల సర్వేశ్వర శాస్త్రి.

"ఇప్పుడు ఏడ్చి ప్రయోజనం ఏమిటి? ఆ స్టీలు సామాను వాడికి 'జరీ' ఇచ్చినప్పుడే ఆలోచించాలి".

'ఆ జరీ కాల్చేస్తాడని నాకు మాత్రం ఏం తెలుసు? గంపలోని స్టీలు గిన్నెపై మోజు వదలలేక చూస్తానంటే 'జరీ' ఇచ్చాను. ఆ జరీ తీసుకుని పెద్ద స్టీలుగిన్నె ఇమ్మన్నాను. ఇచ్చిన వాడివలె టెంకాయిలా తలవూపుతూ జరీ తీసుకుని పరీక్షిస్తానని అగ్గిపుల్లతో అంటించేసాడు. ఎంతో గొడవ చేస్తే ఈ 'మిల్లిగంటి' మాత్రం ఇచ్చాడు'

'మీ ఆడవాళ్ళకు స్టీలుగిన్నెలంటే అంత మోజెందుకో అర్థంకాదు. అందులోనూ బట్టలిచ్చి కొనడం అంటే ఘనకార్యం చేసినట్లే ఫీలయిపోతారు. నీకిష్టం లేనప్పుడల్లా బట్టలకు కన్నం పెట్టేసి పనికిరావంటూ మూటలో కట్టేసి ఆ స్టీలు సామాను వాడికి అర్పించేస్తావు. పది రూ॥ల గిన్ని వస్తుందన్న మోజేగాని అరవై రూ॥ల చీరపోయిందన్న ఆలోచనే ఉండదు'

'నేను కనీసం పది రూ॥ల గిన్నెయినా సంపాదిస్తున్నాను. మీరు చేస్తున్నదేమిటి? పత్రికలో మీ పేరు చూసుకుందామని కట్టలకు కట్టలు ఏవో బరికేస్తూ కాగితాలూ, పోస్టేజీ దండగ చేస్తూ పంపుతున్నా తిరుగు టపాలో వచ్చేయడం లేదా? అయినా మీరు రాయడం మానేరా? ఆదివారం ఉదయాన్నే పెళ్ళి కొడుకులా తయారై పనుందని వెళ్ళి పేకాటలో డబ్బులన్నీ హావరం అయ్యాక పడ్డ మొహంతో ఇంటికొచ్చేయడం మరచిపోయారా? ప్రతీ సినిమాకి మొదటి రోజే బ్లాకులో టికెట్ కొనుక్కుని చూసేసి 'పరమ చెత్తగా ఉంది' అంటూ మమ్మల్ని వెళ్ళనియ్యకుండా చేసే మీరు చాలా పెద్ద ఆలోచనా పరులు' గిన్నెల చప్పుళ్ళతో పాటు లీలగా మాటలూ వినిపిస్తున్నాయి నాకు.

నిజానికి నాకు ఇందాకే తెలివొచ్చింది. ప్రయాణ బడలిక వల్ల లేవాలనిపించక అలాగే కళ్ళు మూసుకుని పడుకుని మా సుబ్బారావు, వాడి శ్రీమతి రాజ్యం చేస్తున్న వాదనలు వింటున్నాను. ఆ సమయంలో నేను లేస్తే వాళ్ళు ఇబ్బంది పడకొచ్చని అలాగే నిద్రనటిస్తున్నాను.

ర ర ర

రాజకీయ నాయకులకు పదవులంటే మోజు అందుకోసం వాళ్ళు రోజుకో పార్టీలో పిల్లిమొగ్గలేస్తుంటారు. వారికి అచర్య తప్పుగా కనిపించదు, ప్రజలకు వారి చేష్టలు ఏవగింపు కలిగించినా.

యువకులకు ప్రేమ అంటే మోజు. అలాగే మా సుబ్బారావుకి పేకాట అన్నా, సినిమాలన్నా విపరీతమైన మోజు. ఎటువంటి చెత్త సినిమా అయినా ఓపికగా చూసే శక్తి వుంది. ఎలాగైనా తంటాలుపడి టికెట్లు సంపాదించి మొదటి రోజునే సినిమా చూసేస్తుంటాడు.

ఆవేశం తగ్గిపోయినట్లుంది, సుబ్బారావు బ్రతిమాలే ధోరణికి వచ్చాడు.

'కోపం ఎందుకే సుందరాంగి! ప్రణయ కలహాల సరసాలే వినోదం అన్నాడో కవి అప్పుడప్పుడు భార్యాభర్తలు గిల్లికజ్జాలు ఆడుకోవాలి. తమ సువర్ణ హస్తాలతో కాఫీ ఇచ్చుకుంటే ధన్యుడినవుతాను'.

'మీ సినిమాడైలాగులు ఆపండి! మీ కిష్టమైన పెసరట్లు వేద్దామనుకుంటున్నాను' అంది ముసి ముసిగా నవ్వుతూ రాజ్యం.

'సుకన్యా అట్లకాడ చేత్తో పుచ్చుకుని పెసరట్లు వేస్తానంటే భయం వేస్తోందోయ్!'

'మీరు ఇంకా ఇలాగే నాకు అడ్డంపడితే ఆ పని జరిగినా జరుగుతుంది. అన్నయ్యగారు లేచారేమో చూడండి కాఫీ ఇస్తాను'

'అమ్మయ్య! ఇంక లేచిపోవచ్చు!' అనుకుంటూ అప్పుడే లేచిన వాడిలా గట్టిగా ఆవలించాను.

'అదిగో వాడు లేచినట్లున్నాడు. కాఫీ రెడీ చేసేయ్' అంటూ నా దగ్గరకు వచ్చాడు సుబ్బారావు.

నేను మొహం కడుక్కుని వచ్చి కాఫీ తాగుతుంటే సినిమాకి వెళ్దాం అన్నాడు సుబ్బారావు.

'శలవు రోజుల్లో వెళ్తే టికెట్లు దొరకవేమో?'

'టికెట్ల సంగతి నాకొదిలెయ్'

'బ్లాకులో కొంటే నా కిష్టం ఉండదు!'

'బ్లాకులో ఎందుకు కొంటాను? చూస్తావుగా ఎలా సంపాదిస్తానో?'

ఇద్దరం సినిమా థియేటర్ దగ్గరకు వచ్చేసరికి జనం బాగా వున్నారు.

టికెట్లు దొరుకుతాయనే నమ్మకం లేకపోయినా 'క్యూ'లో నిల్చున్నాను.

'మనిషికి రెండు టికెట్లు మాత్రమే' అనే బోర్డు ప్రకారం నా తరువాత వారికి కూడా టికెట్లు దొరకాలి.

సుబ్బారావు మాత్రం 'క్యూ'లో నిల్చోకుండా అటూ-ఇటూ తచ్చాడుతున్నాడు. 'క్యూ'లో ముందట నిల్చున్న వాళ్ళని టికెట్ తీయమని రిక్వెస్ట్ చేస్తున్నాడు.

కొందరు నిర్మోహమాటంగా తిరస్కరిస్తే, మరికొందరు తాము రెండు టికెట్లు తీసున్నామని తెలివిగా తప్పించుకున్నారు. చివరికి ఎవరోన్ని సంపాదించాడు. వాళ్ళకి టికెట్స్ తీయమని పది రూ॥ నోటు ఇచ్చాడు. చిల్లర లేదన్నారు వాళ్ళు. టికెట్స్ తీసాక ఇమ్మన్నాడు సుబ్బారావు.

నా దగ్గరకు వచ్చి ఫోజు కొడుతూ 'క్యూ'లోంచి నన్ను బయటకు లాగేసాడు. థియేటర్‌కు ఎదురుగా వున్న కాఫీ హోటల్‌కు వెళ్ళాం.

'ఎలావుంది మన ఐడియా? 'క్యూ'లో నిల్చునే అవుసరంలేకుండా టికెట్స్ సంపాదిస్తున్నాను'.

'నీ పద్ధతి నాకేం నచ్చలేదు. ప్రతివాడూ ఇలాగే చేస్తే ముందుగా 'క్యూ'లో వచ్చి నిల్చున్న వాళ్ళకు టికెట్లు ఎలా దొరుకుతాయి?'

'అలాంటి పట్టింపులుంటే సినిమాలు చూడ్డం చాలా కష్టమోయ్'

టికెట్లు ఇవ్వడం ప్రారంభించడంతో గొడవ ప్రారంభం అయింది. అంతవరకూ వున్న 'క్యూ' చెదిరిపోయింది. బలం వున్న వాళ్ళు ముందుకు చేరిపోగా బలహీనులు వెనకాల నిస్సహాయంగ నిలబడిపోయారు.

హోటల్లో కూర్చున్న మాకు అంతా స్పష్టంగానే కని




మా ప్రత్యేక తయారింపులు

♦ 100% ట్యాగ్, ♦ చందా, ♦ చోనా,
♦ సురైబ్, ♦ టిట్ టాప్, ♦ మెకా,
♦ మున్నా.

పై ఉదహరించిన బనియన్లను అతి నాణ్యమైన రీతులలో తయారిస్తున్నాము. బనియన్లు కొనేటప్పుడు "ట్యాగ్" మార్కున్నదా అని చూచి కొనండి.

: తయారించువారు :

**TYAG KNITTINGS**
(Prop: S. Palanisami)
Kariyagounder Street Khaderepet,
TIRUPUR - 638 601.

★★

**GANDHI TEX**
15, B. S. S. Nagar, Devangapuram,
TIRUPUR - 638 602.

పిస్తోంది. మేం సిగిరెట్లు వెలిగించి గేటు దగ్గరకు వచ్చే సరికి బుకింగ్ క్లోజ్ అయిపోయింది.

సుబ్బారావు టికెట్లకోసం డబ్బు లిచ్చిన వాళ్ళను వెదకడానికి వెళిపోయాడు.

టికెట్లను బ్లాకులో అమ్మేవాళ్ళ హడావుడి ఎక్కువయింది.

అక్కడున్న పోలీసుల వైఖరి నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. ఇందాక 'క్యూ'లో దొమ్మి జరుగుతున్నంత సేపు ఎవరూ రాలేదు. తెలుగుసినిమాల్లో ఆఖరి సన్నివేశంలో హీరో అందర్నీ యుద్ధంలో చిత్తుగా ఓడించేసాక 'యూ ఆర్ అండర్ అరెస్ట్' అంటూ వచ్చే పోలీసులలాగే, దొమ్మి పూర్తయ్యాక వచ్చి హడావుడి చేస్తూ దౌర్జన్యకారులు ముందు వరసలోనూ, నిస్సహాయులు వెనకగా నిల్చోడంలో తమకృషి ఎక్కువ చేయడం వింతేకదా?

అంతలో నాకు తెలిసిన కుటుంబరావుగారు పలకరించడంతో ఈ లోకంలోకి వచ్చాను.

'టికెట్లు దొరకలేదేమిటోయ్?'

'మావాడు ఎవరికో డబ్బులిచ్చాడు. ఇంకా రాలేదు. మీకు టికెట్లు బాగానే దొరికాయే?'

బ్లాకులో కొన్నానోయ్!

'అదేమిటి సార్! మీలాంటి వాళ్ళు కూడా టికెట్లు బ్లాకులో కొంటే ఎలా?'

'బ్లాకులో కొనడం నాకూ ఇష్టం లేదు. కాని ఈ బ్లాక్ మార్కెట్ నిరోధించడానికి చిత్తశుద్ధితో కృషి జరిగితేనే నాలాంటి వాడు టికెట్లు ఎలా కొనగలుగుతాడు? నేను ఎంతో ముందుగా వచ్చి 'క్యూ'లో నిల్చున్నా టికెట్లు దొరకలేదు. అంటే సగం టికెట్లు ముందుగానే బయటకు వెళిపోయాయన్న మాట. బ్లాక్ మార్కెట్లో టికెట్లు అమ్మేవాళ్ళు దౌర్జన్యంగా 'క్యూ'లో చొరబడుతున్నా, గందరగోళం చేస్తున్నా చూసీ చూడనట్లు ఊరుకుంటున్నారు పోలీసు సిబ్బంది, థియేటర్ యాజమాన్యం. పోస్టర్లలో బొమ్మలకు దండలు వేసి, థియేటర్లలో డ్యూయెట్స్ ప్రదర్శించ బడుతున్నప్పుడు డబ్బులు విసిరే అభిమాన సంఘాల సభ్యులు ఈ బ్లాక్ మార్కెట్టు అరికట్టడానికి ప్రయత్నిస్తే బాగుండేది. కాని తమ హీరో (యిన్) చిత్రం యొక్క టికెట్టు ఎంత ఎక్కువ ధరకు బ్లాకులో అమ్మబడితే అంత గొప్పతనంగా భావిస్తున్నారు వాళ్ళు. నేను ఈ రోజు టికెట్లు కొనకుండా ఇంటికి వెళ్ళి, మళ్ళీ మరోసారి పిల్లలతో చాలాదూరం నుంచి రావాలంటే ఇప్పుడు బ్లాకులో కొన్నకంటె ఎక్కువ ఖర్చు పెట్టవలసి వస్తుంది. వారానికి ఒకసారి వచ్చే సెలవుల్లో అందరికీ అందుబాటుగా వుండి, అలరింపచేసే వినోదసాధనం సినిమా ఒక్కటే ఈ బలహీనత ఆధారంగానే బ్లాక్ మార్కెట్టు విచ్చలవిడిగా జరిగిపోంది' అంటూ చెప్పుకుపోతున్నారు ఆయన.

'నాన్నా సినిమా మొదలయిపోతోంది! త్వరగా లోపలికి వెళిపోదాం!'

పిల్లలు తొందర చేయడంతో ఆయన థియేటర్లోకి వెళిపోయారు. థియేటర్లో న్యూస్‌రీల్ ప్రారంభం కావడంతో చాలామంది థియేటర్లోకి వెళిపోయారు. సుబ్బారావు జాడ లేదు.

ఒకని దగ్గర ఏదో ఘర్షణ జరగడం నా దృష్టిలో పడింది. మా సుబ్బారావు గొంతు వినిపించడంతో నేను గబగబా అక్కడకు వెళ్ళాను.

అక్కడ సుబ్బారావు ఎవరితోనో ఘర్షణ పడుతున్నాడు. ఆ వ్యక్తి ఎవరో కాదు. మావాడు టికెట్లు కొనమని డబ్బులిచ్చిన వాడు.

'టికెట్లు తెస్తానని డబ్బులు తీసుకుని, ఇప్పుడు డబ్బులివ్వలేదని దబాయిస్తావా?' మావాడు ఉక్రోషంగా అడుగుతున్నాడు.

'నువ్వు నాకు డబ్బులిచ్చావా? నాకే టోకరా తిని పిద్దామనుకోకు! నీట్టుగా డ్రస్ చేసుకున్నంత మాత్రాన నువ్వు ఏది చెబితే అది ఇక్కడ వాళ్ళు నమ్మేస్తారని కల్లిబొల్లి కబుర్లు చెప్పి డబ్బులాగాలని చూస్తున్నావా? నువ్వు నాకు డబ్బులిచ్చినట్లు ఇక్కడున్న ఎవరిచేతనైనా సాక్ష్యం ఇప్పించగలవా?' దాదాపు గద్దించి అడిగాడు వాడు.

'అవును! సాక్ష్యం ఇప్పించు!' అంటూ వాడిలాంటి వాళ్ళే మరో నలుగురు ముందుకు వచ్చారు.

వాళ్ళందరూ చవకరకం టెర్లిన్ షర్టులు, కాకీ నిక్కర్లు ధరించి, కండలు తిరిగిన శరీరాలతో నల్లగా ఉన్నారు.

మావాడు సాక్ష్యం చెప్పేందుకు ఎవరైనా ఉన్నారేమోనని చుట్టూ చూసాడు. అప్పటికే అందరూ థియే

టర్లోకి వెళిపోయారు. పోలీసులు కూడా 'ఫ్రీ'గా సిన్మా చూసేందుకు థియేటర్లోకి వెళియారు బ్లాకులో టికెట్లు అమ్మేవాళ్ళు, నేను మాత్రమే మిగిలాం.

'వీడెవడో కేటుగాడిలా వున్నాడు. నాలుగు తగిలించండి' అన్నాడు వాళ్ళలో ఒకడు.

పరిస్థితి చేయదాటిపోతోందని గ్రహించి నేను కలుగ చేసుకుని వారి మధ్య నుంచి సుబ్బారావును విడిపించి ఇవతలకు తీసుకొచ్చాను. వాడు ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నా వారించి వాడితో రోడ్డు మీదకు వచ్చాను.

కాని సుబ్బారావు ఆవేశంతో ఊగిపోతూ 'ఆ దొంగ వెధవల్ని వదిలిపెట్టకూడదు! పోలీసు రిపోర్టు ఇస్తాను' అంటూ ఎగరడం ప్రారంభించాడు.

వాడికో కూల్ డ్రింక్ ఇచ్చి శాంతింప చేసాను.

'నీపిచ్చిగాని మనం వాళ్ళని ఏమీ చెయ్యలేం. వాళ్ళు బ్లాకులో టికెట్లు అమ్ముకునే వాళ్ళు. నీ పది రూ॥లు కాజేసి ఆ డబ్బుతో కొన్ని టికెట్లు బ్లాకులో అమ్ముకుని డబ్బు చేసుకున్నారు. నువ్వు సిన్మామోజులో పడి ఎవరికి డబ్బు ఇస్తున్నావో అర్థం చేసుకోలేక పోయావు. వాళ్ళ గూండాయిజాన్ని, రౌడీతనానికి భయపడి నీ తరఫున ఎవరూ సాక్ష్యం చెప్పరు. తరువాత జరిగే పర్యవసానం అందరకూ తెలిసిందే. నువ్వు డబ్బు ఇవ్వలేదంటూ వాడు అనేకులతో సాక్ష్యం చెప్పించగలడు. పోలీసు రిపోర్టు ఇస్తే నువ్వు స్టేషన్ చుట్టూ తిరగడమే తప్ప ప్రయోజనం ఏమీ ఉండదు. ఎందుకంటే వాళ్ళ కళ్ళముందే బ్లాక్ మార్కెట్టు జరుగుతుంటే చూడనట్లు వ్యవహరించే వాళ్ళ వల్ల ఏదో సహాయం అందుతుందని అనుకోకు' అంటూ ఓదార్చి ఇంటిదారి పట్టించాను.


# కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

విడి ప్రతి ... 50 పైసలు

సంవత్సర చందా ... రూ. 11-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారలుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్సు బుక్ స్టాల్సులో దొరుకును.

* కథాంజలి *

నెం. 10, మురుగేశ మొదలి వీధి,

మదరాసు - 600 001.




**

"మీ కోసం"

చిత్రంలో

విజయ,

రావుగోపాలరావు.

**